సాక్షి
ప్రకాశం
సోమవారం । 1 । జూలై । 2024



సత్యవోలు ఎడ్లజత సత్తా
జిల్లాలోని రాచర్ల మండలం సత్యవోలు ఎడ్ల జత సత్తాచాటింది. పామూరు మండలంలో అచ్చమాంబ పేరంటాళ్లమ్మ తిరునాళ్ల సందర్భంగా ఎడ్లపందేలు నిర్వహించారు. - 8లో..



రామాపురంలో వ్యక్తి దారుణ హత్య
రాచర్ల మండలం గుడిమెట్ట పంచాయతీ రామాపురంలో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఘటన శనివారం రాత్రి జరిగింది. - 10లో..

గరిష్టం/కనిష్టం
30.4/26.5

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

నీట్ లీకేజీని నిరసిస్తూ 4న విద్యాసంస్థల బంద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి నాయకులు

ఒంగోలు టౌన్: నీట్, పీజీ యూజీసీ నెట్ పరీక్షా పేపర్ల లీకేజీలను నిరసిస్తూ ఈ నెల 4వ తేదిన విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు పలు విద్యార్థి సంఘాల నాయకులు ప్రకటించారు. ఆదివారం ఎల్బీజీ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ రాజశేఖర్ వివరాలు వెల్లడించారు. పరీక్షా పేపర్ల లీకేజీని నిరసిస్తూ కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థలను బంద్ చేసేందుకు ఆయా విద్యార్థి సంఘాల కేంద్ర నాయకత్వం పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యా వ్యవస్థను కేంద్రం తన గుప్పిట్లోకి తీసుకుందని, వన్ నేషన్ వన్ ఎగ్జామ్ పేరుతో పరీక్షా వ్యవస్థను ఘోరంగా దెబ్బ తీసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం నిర్వాకం వలన లక్షలాది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిందని చెప్పారు. ఇటువంటి కేంద్రీకృత పరీక్షల విధానం విద్యా వ్యవస్థను ప్రైవేటీకరించడానికి, కోచింగ్ సెంటర్ల సంస్కృతిని పెంపొందించడానికి మాత్రమే పనికి వస్తుందన్నారు. 2018-22 మధ్యలో దేశం మొత్తం మీద 61885 పాఠశాలలను మూసి వేశారని, బీజేపీ పాలనలో విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు భారీగా తగ్గించారని, ఈ కారణంగానే ప్రభుత్వ పాఠశాలలు తగ్గాయని తెలిపారు.



అడవుల్లో గస్తీ తిరుగుతున్న ఏనుగు(ఫైల్)

ఇప్పటి వరకు నల్లమలలో కానరాని ఏనుగులను ఈ ప్రాంతానికి తెచ్చేందుకు అటవీ శాఖ చర్యలు తీసుకుంటోంది. అభయారణ్యంలోని అమూల్యమైన వృక్షాలు, వన్యప్రాణులను సంరక్షించేందుకు ఎన్నిరకాలుగా చర్యలు తీసుకుంటున్నా.. ఇంకా దట్టమైన అరణ్యం లోపలికి అటవీ గార్డులు వెళ్లలేకపోతున్నారు. చిట్టడవిలో ఎక్కడికైనా వెళ్లగలిగే శిక్షణ పొందిన గజరాజులను నల్లమలకు తెప్పించి వాటితో గస్తీ కాసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

గజరాజులతో గస్తీ

- మైసూర్ నుంచి నల్లమలకు రానున్న ఏనుగులు
- ఆంధ్రాకు 9 ఏనుగులను పంపేందుకు అనుమతి
- శిక్షణ కోసం కర్ణాటక రాష్ట్రానికి వెళ్లనున్న సిబ్బంది

పెద్దదోర్నాల: వనాలు, వన్యప్రాణులు ప్రకృతికి దేవతలు ప్రసాదించిన వరాలు. ఆ అడవులను సంరక్షించుకోవటం మన అందరి బాధ్యత. దక్షిణ భారతదేశంలో ప్రాముఖ్యతను సంతరించుకున్న నల్లమల అభయారణ్యాల పరిరక్షణకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. నల్లమల అటవీ ప్రాంతంలోని అమూల్యమైన వృక్షసంపద అక్రమ రవాణాను అరికట్టేందుకు, అరుదైన వన్యప్రాణులను సంరక్షించి వేసవిలో అగ్నికీలల నుంచి అటవీ ప్రాంతాన్ని కాపాడేందుకు అటవీ శాఖాధికారులు ప్రత్యేకంగా ప్రణాళికను రూపొందించారు. పలు ప్రాంతాల్లో బేస్ క్యాంప్‌లు, స్ట్రైకింగ్ ఫోర్స్‌లు, యాంటీ పోచింగ్ బృందాలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు అటవీ ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకునేందుకు ఆధునిక టెక్నాలజీతో కూడిన వాకీటాకీలను ఉపయోగిస్తున్నారు. దీంతో పాటు సరికొత్తగా అభయారణ్యాల్లో ఇకపై గజరాజులతో గస్తీ చేపట్టాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.


గజరాజుల కోసం కర్ణాటక అటవీశాఖకు విజ్ఞప్తి:
నల్లమల అభయారణ్యంలోని మారుమూల ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించేందుకు తమకు 9 శిక్షణ పొందిన ఏనుగులు కావాల్సిందిగా రాష్ట్ర అటవీశాఖ అధికారులు కర్ణాటక అటవీశాఖకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో కర్ణాటక అటవీశాఖ అధికారులు శిక్షణ పొందిన ఏనుగులను ఆంధ్రప్రదేశ్‌కు పంపేందుకు ఆమోదం తెలిపారు. దీంతో పాటు ఏనుగులను కట్టడి చేసేందుకు మావటీలను తయారు చేసేందుకు అటవీశాఖ తమ సిబ్బందిని కర్ణాటక రాష్ట్రానికి పంపనుంది. రాష్ట్రానికి చెందిన సిబ్బంది అక్కడికి చేరుకుని గజరాజుల ఆహారపు అలవాట్లు, వాటి కదలికలు, వాటి ఇతర అలవాట్లను క్షుణ్ణంగా పరిశీలించి శిక్షణ పొందనున్నారు. దీంతో త్వరలో ఈ నల్లమల అభయారణ్యానికి ఏనుగులను తరలించి వాటి ద్వారా గస్తీ ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. నల్లమలకు తరలించే ఏనుగులతో ఆరు ఏనుగులను రాజీవ్‌గాంధీ వన్యప్రాణుల అభయారణ్యానికి, మరో మూడు ఏనుగులను గుండ్లబ్రహ్మేశ్వరం అడవులకు పంపేలా చర్యలు చేపట్టనున్నారు. దీంతో పెద్ద పులులు ఎక్కువగా సంచరించే లోతట్టు ప్రాంతాలైన నెక్కంటి, రేగుమానుపెంట, తూము గుండాలు, ఆలాటం తదితర ప్రాంతాల్లో సైతం ధైర్యంగా పెట్రోలింగ్ చేపట్టవచ్చని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు.



లోతట్టు అటవీ ప్రాంతంలో గస్తీ నిర్వహించేలా చర్యలు



అభయారణ్యంలోని కొన్ని మారుమూల ప్రాంతాల్లో గస్తీ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. నడక మార్గంలో సిబ్బంది కొంత మేర వరకు మాత్రమే వెళ్లగలరు. అదే ఏనుగులతో అయితే సుదూర ప్రాంతాల్లో గస్తీ నిర్వహించవచ్చు. పులులు సంచరించే ప్రదేశాల్లో సైతం భయం లేకుండా పెట్రోలింగ్ నిర్వహించవచ్చు. మనం చేసిన విజ్ఞప్తికి కర్ణాటక అటవీశాఖ సానుకూలంగా స్పందించింది. అతి త్వరలో ఏనుగులు నల్లమలకు రప్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.
– విశ్వేశ్వరరావు, ఫారెస్ట్ రేంజి అధికారి, పెద్దదోర్నాల



భారీ వైశాల్యంలో నల్లమల అభయారణ్యం
ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం, నంద్యాల, పల్నాడు జిల్లాల్లో 3,727.82 చదరపు కిలోమీటర్ల పరిధిలో వ్యాపించి ఉన్న అడవిని కేంద్ర ప్రభుత్వం 1983లో అభయారణ్యంగా ప్రకటించింది. పెద్దదోర్నాల నుంచి శ్రీశైల శిఖరం వరకు రాజీవ్‌గాంధీ అభయారణ్యంగా మార్కాపురం, గిద్దలూరు, ఆత్మకూరు, నంద్యాల డివిజన్లలో గుండ్లబ్రహ్మేశ్వర అభయారణ్యం ఉంది. అభయారణ్యంలో జీవించే పులులతోపాటు, చిరుత, ఎలుగుబంటి, జింకలు, దుప్పులు, హైనా, నెమళ్లతోపాటు 70 రకాల క్షీరదాలు, సరీసృపాలు, ఎన్నోరకాల వృక్షాలు, ఔషధ మొక్కలు నల్లమల అభయారణ్యంలో ఉన్నాయి. ఇవన్నీ నల్లమల అభయారణ్యంలోని మారుమూల లోతట్టు ప్రాంతాల్లో ఇమిడి ఉన్నాయి. దీంతో ఆయా ప్రాంతాలను సందర్శించి వాటిని సంరక్షించే బాధ్యత కత్తి మీద సాము లాంటిదే అని చెప్పవచ్చు. దీంతో అటవీశాఖ ఉన్నతాధికారులు మారుమూల ప్రాంతాల్లో సుశిక్షితులైన సిబ్బంది నేతృత్వంలో ఏనుగులతో గస్తీ ఏర్పాటు చేయాలన్న నిర్ణయం తీసుకున్నారు.



దుక్కులు దున్ని సాగుకు సిద్ధంగా ఉన్న పొలం



చుక్కనీరు లేని మార్కాపురం చెరువు

జాడలేని తొలకరి

- పొలాలు సిద్ధం... ఆలస్యమవుతున్న వర్షాలు
- సబ్‌డివిజన్‌లో ఖరీఫ్ సాగు లక్ష్యం 53,260 ఎకరాలు
- వర్షాధారం కింద సాగు 37,715 ఎకరాలు
- బోర్లకింద సాగు 15,550 ఎకరాలు



వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతు

మార్కాపురం: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల అయినా సాగుకు పదునయ్యే తొలకరి వర్షాలు కురవకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పశ్చిమ ప్రకాశం అంతటా ఇదే పరిస్థితి నెలకొంది. వర్షం కోసం రైతులు ఎదురు చూపులు చూస్తున్నారు. ఎప్పుడు వర్షం కురిస్తే అప్పుడు పంటలు సాగు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. గత ఏడాది జూన్ చివరి నాటికి వర్షం కురిసి పంటలు సాగు కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం కూడా నమోదు కాకపోవటంతో చెరువులు, వాగులు, కుంటల్లో నీళ్ల లేవు. పరిస్థితి ఇలాగే ఉంటే కరువు ఛాయలు ఏర్పడతాయన్న ఆందోళన ప్రతి ఒక్కరిలో కనిపిస్తుంది. పుల్లలచెరువు నుంచి గిద్దలూరు వరకు ఉన్న 12 మండలాల్లో రైతుల పరిస్థితి ఆగమ్య గోచరంగా ఉంది. వ్యవసాయ శాఖ ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం చేసినా వర్షాలు కురవకపోవటంతో పెట్టుబడులు పెట్టి విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకున్న వ్యాపారులు షాపుల్లో దిగాలుగా కూర్చున్నారు. వర్షం కురిస్తే పంటలు సాగు చేసేందుకు రైతులు పొలాల్లో దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్నారు. ఈపాటికే పత్తి, సజ్జ, కంది, ఆముదం, జొన్న, రాగి, మిర్చి పైర్లు సాగు కావాల్సి ఉండగా ఇంత వరకు పొలాల్లో ఒక్క విత్తనం పడలేదు. మార్కాపురం వ్యవసాయ సబ్ డివిజన్‌లో మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, కంభం, అర్ధవీడు మండలాలు ఉన్నాయి. మొత్తం ఈ సబ్ డివిజన్‌లో ఖరీఫ్ సీజన్‌లో 53,260 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగు కావాల్సి ఉండగా ఇంత వరకు కేవలం 500 ఎకరాల్లో మాత్రమే పంటలు సాగయ్యాయి. యర్రగొండపాలెం సబ్‌డివిజన్ పరిధిలో యర్రగొండపాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు, పెద్దదోర్నాల మండలాలు ఉన్నాయి. గిద్దలూరు సబ్ డివిజన్‌లో గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, బేస్తవారిపేట మండలాలు ఉన్నాయి. ఇక్కడ కూడా అదే పరిస్థితి నెలకొంది. మార్కాపురం మండలంలో మొత్తం 16 చెరువులు ఉన్నాయి. వేములకోట, రాయవరం, గజ్జలకొండ, నాగులవరం, తిప్పాయపాలెం, కోలభీమునిపాడు చెరువుల్లో చుక్క నీరు లేదు. ఇదే పరిస్థితి పశ్చిమ ప్రకాశంలోని వివిధ మండలాల్లో నెలకొంది. అదును దాటి వర్షాలు కురిసినా పంటలు సాగు చేస్తే వివిధ రకాల తెగుళ్ల వచ్చే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నాలుగు రోజుల నుంచి సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆకాశం మేఘావృతమై రైతులను మురిపిస్తోంది. వర్షం చుక్క మాత్రం పడటం లేదు. రైతులు నిరాశ చెందుతున్నారు. సబ్‌డివిజన్ పరిధిలో వర్షాధారం కింద సాగు 37,715 ఎకరాలు, బోర్లకింద సాగు 15,550 ఎకరాలు సాగు కావాల్సి ఉంది. ఇంత వరకూ వర్షాలు పడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జూలై నెల వచ్చినప్పటికీ చెరువుల్లో చుక్కనీరు లేదు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, పక్కన జంకె, ఉడుముల

- మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, ఉడుముల
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: మార్కాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని వారికి అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమని అన్నారు. ఓటమిపై అనేక అనుమానాలు ఉన్నప్పటికీ వాటిని పక్కనపెట్టి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కలసికట్టుగా కృషిచేస్తామని చెప్పారు. ఓటమిపై మనసులో తీరని వేదన ఉన్నప్పటికీ దాని నుంచి బయటపడి పార్టీ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఐదేళ్లకాలంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు అందించారని, ఎన్నికల్లో కూడా 40 శాతానికిపైగా ఓట్లు వైఎస్సార్ సీపీకి వచ్చాయని, ఎవరూ మనోవేదన చెందాల్సిన పనిలేదని అన్నారు. కార్యకర్తలకు ఏ అవసరం వచ్చినా అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ మైనార్టీల సంక్షేమానికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషిచేశారన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి దేశానికే ఆదర్శవంతమైన పాలన అందించారన్నారు. కార్యక్రమంలో మైనార్టీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ షంషేర్ ఆలీబేగ్, జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, వైస్ చైర్మన్ 2 అంజమ్మ శ్రీనివాసులు, ఎంపీపీ బండి లక్ష్మీదేవీ కృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగారెడ్డి, బట్టగిరి తిరుపతిరెడ్డి, నారు నాగిరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ షెక్షావలి, ఉస్మాన్, పొదిలికి చెందిన కేవీ రమణారెడ్డి, లయోలా చెంచిరెడ్డి కొనకనమిట్ల వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, సొసైటీ చైర్మన్ ఉడుముల కాశిరెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు కంకణాల రమేష్, గోనుగుంట్ల శ్రీనివాసులు, ఏలూరు సంజీవరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, కంభం మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వైవీ రావు, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ హనీమూన్ శ్రీనివాసరెడ్డి, యక్కలి శేషగిరిరావు, ఎం.శ్రీనివాసరెడ్డి, తర్లుపాడు మండల పార్టీ కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, మాజీ డైరెక్టర్ ఎన్ కొండయ్య, బీసీ సంఘం జాతీయ కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్, గాయం శ్రీనివాసరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టోల్ పాట్లు

- టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద వాహనదారుల ఇబ్బందులు
- కిలోమీటర్ల మేర నిలుస్తున్న వాహనాలు
- ఎమర్జెన్సీ లైన్లు మూతపడటంతో అంబులెన్సులకు కూడా తప్పని ఇబ్బందులు

టంగుటూరు: జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు టోల్ ప్లాజా వద్ద రాత్రి, పగలు తేడా లేకుండా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టంగుటూరు టోల్ ప్లాజా వద్ద ఆరు లైన్లు ఉండగా ఏ వాహనం అయినా ఏ లైన్‌లో అయినా వెళ్లే వెసులుబాటు ఉండేది. ట్రాఫిక్ జామ్ అవకుండా ప్రయాణం సాఫీగా కొనసాగేది. కానీ జాతీయ రహదారి అధికారులు వాహనదారుల వద్ద అధిక లోడు ఫీజు వసూలు చేయటానికి తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో టోల్ ప్లాజాకు ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి అటు వాహదారులు, ఇటు టోల్ ప్లాజా సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ప్లాజాలో ఉన్న ఆరు కౌంటర్లలో కార్లకు మూడు కౌంటర్లు కేటాయించి, భారీ వాహనాలు ప్రవేశించకుండా బారికేడ్లు వెల్డింగు చేశారు. కార్ల వాహనదారులకు ఆ విషయంపై అవగాహన లేకపోవడంతో లారీలు, బస్సులు పోయే కౌంటర్లలో పోవడంతో భారీ వాహనాల కౌంటర్ల వద్ద ట్రాఫిక్ జామ్ అవుతోంది. కార్ల కౌంటర్లు ఖాళీగానే దర్శనం ఇస్తున్నాయి. టోల్ ప్లాజా అధికారులు పాత పద్ధతిని కొనసాగించాలని వాహనదారులు కోరుకుంటున్నారు.

అవగాహన కల్పించకపోవటంతో..
టోల్ ప్లాజా అధికారులు సిబ్బందిని కేటాయించి అవగాహన కల్పించకపోవటం వలన ట్రాఫిక్ జామ్ అవుతోంది. మొత్తం ఆరు లైన్లు ఉండగా మూడు కార్లకు, మిగిలిన మూడు భారీ వాహనాలకు కేటాయించినా ఆ విషయంపై అవగాహన లేని వాహన చోదకులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నారు. ముఖ్యంగా కాలేజీ బస్సులు, అంబులెన్సులు, ద్విచక్రవాహనాల వారు బాగా ఇబ్బందిపడుతున్నారు. పరిష్కారం చూపాల్సిన టోల్ ప్లాజా యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. కనీసం సిబ్బందిని పెంచకుండా ఉన్న సిబ్బందితో సరిపెట్టి వెట్టి చాకిరి చేయిస్తున్నారు. అదనంగా సిబ్బంది ఉంటే డైవర్షన్ చేసి ట్రాఫిక్ సమస్య అరికట్టవచ్చు.



ట్రాఫిక్‌లో నిలిచిన అంబులెన్సు

ఎమర్జెన్సీ లైను కూడా...
జాతీయ రహదారి అధికారులు తీసుకున్న నిర్ణయం వలన ఎమర్జెన్సీ లైనుగుండా పోయే అంబులెన్సులు, ఎమ్మెల్యే వాహనాలు సైతం ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నాయి. కనీసం అంబులెన్సు ఉన్న సమయంలో కూడా ట్రాఫిక్ క్రమబద్ధీకరించకుండా సిబ్బంది చోద్యం చూస్తున్నారు. టోల్ ప్లాజా అధికారులు సరిపడా సిబ్బందిని నియమించుకొని ట్రాఫిక్ సమస్యను అరికట్టాలని వాహనదారులు కోరుతున్నారు. దీనిపై టంగుటూరు టోల్ ప్లాజా మేనేజర్ నాగేశ్వరరావుని వివరణ కోరగా ట్రాఫిక్ సమస్య ఉన్నమాట వాస్తవమేనని, కేంద్ర ప్రభుత్వం అధిక లోడు ఫీజు వసూలకు లారీలకు ప్రత్యేక లైన్లు ఏర్పాటుతో ఈ సమస్య తలెత్తిందని చెప్పారు. సిబ్బంది కొరత ఉందని, సిబ్బందిని పెంచి, వాహనదారులకు అవగాహన కల్పిస్తామన్నారు.



నెల్లూరు వైపు నిలిచిన వాహనాలు



ఒంగోలు వైపు నిలిచిన వాహనాలు

సేవా స్తంభ్ జిల్లా అధ్యక్షునిగా సుధీర్‌బాబు

ఒంగోలు: సేవా స్తంభ్ (ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ షెడ్యూల్ క్యాస్ట్ /ట్రైబ్స్, బ్యాక్ వర్డ్ అండ్ మైనార్టీస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్) జిల్లా నూతన అధ్యక్షుడుగా సీహెచ్ సుధీర్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం జిల్లా సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీ ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సీహెచ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ ఈ చారిత్రక సంస్థను 1969లో మాజీ సీఎం దామోదరం సంజీవయ్య న్యూఢిల్లీలో రిజిస్టర్ చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన జాతీయ ఆర్గనైజేషన్‌లో దేశ వ్యాప్తంగా లక్షలమంది సభ్యులు ఉన్నారన్నారు. నూతన కమిటీ నిర్మాణాత్మకంగా జిల్లాలో ఉన్న అన్ని శాఖల్లో పనిచేస్తున్న బహుజన ఉద్యోగులందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు.

జిల్లా కమిటీ:
అధ్యక్షులు–సీహెచ్ సుధీర్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్–కె.రాఘవయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్–డాక్టర్ మొగిలి దేవప్రసాద్, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్–ఐనంపూడి నరశింహం, ప్రధాన కార్యదర్శి– కె.బాలాజీరావు, పీఆర్వో–ఎం.కోటేశ్వరరావు, కోశాధికారి– ఎల్.రఘు, ఉపాధ్యక్షులు–ఎస్.శ్రీనివాసరావు, పి.బ్రహ్మానందం, ఎల్.ఆంజనేయులు, జాయింట్ సెక్రటరీలు–వై.సుబ్రహ్మణ్యం, కె.శిరోమణి, కె.రాజేశ్వరి, డి.ఉషారాణి, గౌరవ సలహాదారులుగా ఎంఎస్ఎస్ అశోక్‌బాబు (ఏఆర్ అదనపు ఎస్పీ), డాక్టర్ సీహెచ్ సుధాకర్‌బాబు(రిమ్స్ మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్), డాక్టర్ బక్కమంతుల వినయ్‌కుమార్ (బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు), పర్రె వెంకట్రావు (బీటీఏ రాష్ట్ర కార్యదర్శి).



సేవా స్తంభ్ జిల్లా నూతన కమిటీ

క్లుప్తంగా

200 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న ఎస్సై సైదుబాబు

పామూరు: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు, రెవెన్యూ సిబ్బంది స్వాధీనం చేసుకున్న సంఘటన పామూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేటు గోడౌన్ కాంప్లెక్స్‌లో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గోడౌన్‌లో అక్రమంగా రేషన్‌బియ్యం నిల్వ ఉంచినట్లు అందిన సమాచారం మేరకు సీఐ ఎం.రామానాయక్, ఎస్సై సైదుబాబు, వీఆర్‌ఓలు షేక్.రఫి, రఫీఅహ్మద్ తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో గోడౌన్‌లో 200 బస్తాలు (100 క్వింటాలు) రేషన్ బియ్యం ఉండగా స్వాధీనం చేసుకున్నారు. బాధ్యుడైన శ్రీనివాసులుపై కేసు నమోదు చేశారు. బియ్యాన్ని సివిల్ సప్లయిస్ గోడౌన్ సిబ్బందికి స్వాధీనం చేసినట్లు ఎస్సై సైదుబాబు తెలిపారు.

సత్యవోలు ఎడ్ల జత సత్తా



పందెపురాయిని లాగుతున్న ఎడ్లజత



పోటీలను తిలకించడానికి భారీగా హాజరైన అభిమానులు

- రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో మొదటిస్థానం కైవసం

పామూరు: జిల్లాలోని రాచర్ల మండలం సత్యవోలు గ్రామానికి చెందిన ఎడ్ల జత సత్తా చాటింది. పామూరు మండలంలోని బొట్లగూడూరు గ్రామ పంచాయతీ పరిధిలో గల కమ్మవారిపాలెం, రఘునాథపురం గ్రామాల సమీపంలోని శ్రీ అచ్చమాంబ పేరంటాలు తిరునాళ్ల సందర్భంగా ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో మొత్తం 6 జతల ఎడ్లు పాల్గొన్నాయి. సత్యవోలుకు చెందిన బత్తుల బాలరాజు ఎడ్ల జత నిర్దేశిత సమయంలో 1500 అడుగులు బండ లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. వైఎస్సార్ కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన ద్వారశిల గురివిరెడ్డి ఎడ్ల జత 1362.10 అడుగులు బండ లాగి ద్వితీయస్థానంలో నిలిచింది. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరి వీరాస్వామిచౌదరి ఎడ్లజత 1295.6 అడుగులతో తృతీయస్థానంలో నిలిచింది. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం టంగుటూరుకు చెందిన మక్కెన కోటేశ్వరరావు ఎడ్లజత 1153.3 అడుగులతో నాలుగో స్థానంలో, బాపట్ల జిల్లా బల్లికురవ మండలం బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరి వీరాస్వామిచౌదరి రెండో ఎడ్ల జత 1080.3 అడుగులతో 5వ స్థానంలో నిలిచింది.

విజేతలకు మొదటి బహుమతిగా రూ.40 వేలను కే మాలకొండరాయుడు, రెండో బహుమతిగా రూ.30 వేలను బి.మోహన్‌రావు, మూడో బహుమతిగా రూ.20 వేలను పి.చిన్నకృష్ణయ్య, నాలుగో బహుమతిగా రూ.15 వేలను జి.మాల్యాద్రి, గణపతి, 5వ బహుమతిగా రూ.10 వేలను ఎర్రసింగు వెంగళరావు సమకూర్చారు. వాటిని ఆలయ కమిటీ ప్రతినిధులు అడుసుమల్లి చెంచయ్య, నరసింహులు, తిరుపతయ్య, మల్లికార్జున, దుద్దుకూరి యోగానంద్, రావెళ్ల వెంకటరత్నంతో కలిసి విజేతలకు అందజేశారు.

మీ సేవలను పోలీసు శాఖ గుర్తుంచుకుంటుంది

- రిటైర్డ్ పోలీసుల సన్మాన సభలో ఎస్పీ సుమిత్ సునీల్

ఒంగోలు టౌన్: నీతి నిజాయితీలతో సుదీర్ఘకాలం మీరు అందించిన సేవలను పోలీసు శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ అన్నారు. జిల్లా పోలీసు శాఖలో విశేష సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన నలుగురు ఎస్సైలు, 1 ఏఎస్సై, 1 హోంగార్డును ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రసంగిస్తూ.. విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న ఉద్యోగులు విశ్రాంత జీవితాన్ని ప్రశాంతంగా, సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. పోలీసు శాఖలో నిబద్ధతగా సేవలందించేందుకు సహకరించిన కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో ఏదైనా సమస్య వస్తే నేరుగా తనకు తెలియజేయాలని, పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్పీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, డీసీ ఆర్బీ సీఐ భీమానాయక్, పీసీఆర్ సీఐ వెంకటేశ్వరరావు, ఆర్ఐ సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన పోలీసులను సన్మానిస్తున్న ఎస్పీ సుమిత్ సునీల్

ఒకేరోజు ఆరుగురు సిబ్బంది ఉద్యోగ విరమణ...

పోలీసు శాఖలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న ఆరుగురు సిబ్బంది ఒకేరోజు ఉద్యోగ విరమణ చేశారు. మహిళా ఎస్ఐ ఎస్.శారాకుమారి, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ కె.వి.నరసరాజు, డీసీఆర్బీ ఎస్సై ఎస్.కమలాకర్, ఎస్సై జి.కృష్ణయ్య, ఒంగోలు టూ టౌన్ ఏఎస్సై కె.సుబ్బారావు, హోంగార్డు కె.రవీంద్రబాబు ఉద్యోగ విరమణ చేయగా, వారిని ఎస్పీ ఘనంగా సన్మానించారు.

పొలాల్లో వ్యక్తి మృతదేహం లభ్యం

కురిచేడు: మండలంలోని దేకనకొండ గ్రామ పొలాల్లో ఆదివారం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతూ గుర్తించేందుకు వీలు లేకుండా ఉంది. అయితే, మృతుడు తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా గోపాలపేటకు చెందిన అయినవోని లక్ష్మయ్య (55)గా గుర్తించినట్లు స్థానిక ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి దర్శికి బతుకుదెరువు కోసం అతను వచ్చినట్లు తెలిసింది. అతని స్నేహితులు మండలంలోని పెద్దవరం వద్ద సింగరయ్యకొండ నుంచి తీస్తున్న కంకర మిల్లుల వద్ద పనిచేస్తున్నారు. లక్ష్మయ్య అక్కడికి తరచూ వచ్చి వెళ్తుంటాడు. లక్ష్మయ్యకు మతిస్థిమితం లేదని అతని స్నేహితులు తెలిపినట్లు ఎస్సై శ్రీకాంత్ వెల్లడించారు. ఈ క్రమంలో 20 రోజుల క్రితం లక్ష్మయ్య తన స్నేహితుల వద్దకు వచ్చి వెళ్తూ మృతిచెంది ఉంటాడని అనుమానిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పొలాల మధ్య చిన్న కాలువలో మృతదేహం పడి ఉండటంతో లక్ష్మయ్య మృతి వెనుక ఏమైనా కారణాలున్నాయా..? అనే కోణంలో విచారణ చేపట్టామన్నారు. ఎవరైనా హత్య చేసి అక్కడ పడేశారా..? అనే కోణంలో కూడా విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతిచెంది 20 రోజులైనా అతని గురించి స్నేహితులు తెలుసుకోకపోవడం ఏమిటని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతుని బంధువులకు అప్పగించనున్నట్లు ఎస్సై తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీకాంత్

కాలు జారి బావిలో పడి వ్యక్తి మృతి

ముండ్లమూరు: ప్రమాదవశాత్తూ కాలు జారి బావిలో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన ముండ్లమూరు మండలంలోని వేముల గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వినుకొండ నాగరాజు (48) గ్రామ సమీపంలోని చెరువు వద్ద నీటి కోసం రైతులు తవ్వుకున్న బావిలో గాలం వేసి చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తూ కాలు జారి బావిలో పడి మృతిచెందాడు. బావిలో నీరు ఎక్కువగా ఉండటంతో మోటార్ల సహాయంతో స్థానికులు నీటిని బయటకి పంపే ప్రయత్నం చేస్తున్నారు. నీరు పూర్తిగా బయటకు వెళ్తేనే మృతదేహం లభ్యమవుతుందని స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాగరాజు బావిలో పడి మృతిచెందాడని సమాచారం అందుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో చెరువు వద్దకు వెళ్లి మృతదేహాన్ని బయటకు తీసే ప్రయత్నం చేస్తున్నారు.



ఇంజిన్ సహాయంతో బావిలోని నీటిని బయటకు తోడుతున్న గ్రామస్తులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాచర్ల: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన రాచర్ల మండలంలోని చర్లోపల్లె గ్రామ సమీపంలో గల గుమ్ముళ్లపల్లె క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. బేస్తవారిపేట మండలం మోక్షగుండం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు పెరూరి గుంటయ్య (65) గిద్దలూరు పట్టణంలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం ఆర్మీ క్యాంటీన్‌లో సరుకులు తీసుకుని గిద్దలూరు నుంచి మోక్షగుండానికి టీవీఎస్ మోటారు సైకిల్‌పై బయలుదేరి కుటుంబ సభ్యులకు సరుకులిచ్చి తిరుగు ప్రయాణంలో గిద్దలూరు వస్తున్నాడు. గుమ్ముళ్లపల్లె క్రాస్‌రోడ్డు వద్దకు రాగానే గిద్దలూరు నుంచి ఒంగోలు వైపునకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గుంటయ్య తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాచర్ల ఏఎస్సై ఆదిశేషయ్య సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.



ప్రమాద స్థలంలో నుజ్జయిన టీవీఎస్ మోటారు సైకిల్



మృతిచెందిన గుంటయ్య

ధన్వంతరి వారసులు.. ధరణిలోన దేవతలు

- ఆధునిక వైద్యంతో ప్రాణాలు పోస్తున్న వైద్యులు
- స్మార్ట్ సిటీల్లో లభించే వైద్యాన్ని ఒంగోలు ప్రజలకు అందిస్తున్న వైద్యులు
- నాణ్యమైన వైద్య చికిత్సలతో మన్ననలు పొందుతున్న స్పెషలిస్ట్ డాక్టర్లు
- తక్కువ ధరలకే మోకీళ్ల మార్పిడి వైద్యం చేస్తున్న ఆసుపత్రులు
- నేడు అంతర్జాతీయ డాక్టర్ల దినోత్సవం

ఒంగోలు టౌన్: ధన్వంతరి వారసులు ధరణిలోన దేవతలు అన్నారు వైద్యుల గురించి మన పెద్దలు. దేవుడు మట్టి బొమ్మలకు ప్రాణం పోసి మనుషులను సృష్టించాక మనుషుల మంచి చెడ్డలను చూసేందుకు వైద్యులను పుట్టించాడని చెబుతారు! తల్లి గర్భంలో ఉన్నపుడు పురుడు పోసేది, పెరిగి పెద్దయ్యేంత వరకు ఆరోగ్యాన్ని కాపాడేది, ఆపదలో ఉన్నపుడు ప్రాణం పోసేది వైద్యుడే. అందుకే మన సమాజంలో వైద్యులను ఎంతో గౌరవిస్తారు. ఆదరించి అభిమానం చూపుతారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో ప్రభుత్వ వైద్య కళాశాల ఉంది. ప్రతి ఏడాది ఎంతో మంది వైద్యులు ఇక్కడ విద్యాభ్యాసం పూర్తి చేసుకొని వైద్యులై వస్తున్నారు. అలాగే ఎంతో మంది సీనియర్ వైద్యులు ప్రజలకు వైద్య సేవలను అందిస్తున్నారు. సుందరయ్యభవన్ రోడ్డు, 60 అడుగుల రోడ్డు, అంజయ్య రోడ్డు, ముంగమూరు రోడ్డుతోపాటు నగరం చుట్టూ ఎన్నో వైద్యశాలలు ప్రజలకు వైద్య సేవలను అందిస్తున్నాయి. కొన్ని రకాల దీర్ఘ కాలిక వ్యాధులకు, శస్త్ర చికిత్సలకు గతంలో అటు చెన్నై, ఇటు హైదరాబాద్, విజయవాడకు వెళ్లాల్సి వచ్చేది. ఈ లోపు పుణ్యకాలం కాస్తా గడిచిపోయేది. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. పెద్ద పెద్ద నగరాల్లో మాత్రమే లభించే వైద్యం ఒంగోలులోనే లభిస్తుంది. స్పెషాలిటీ వైద్యులతో సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలు వెలిశాయి. ఒంగోలు ప్రజలకు అందుబాటులో చక్కటి వైద్యాన్ని అందిస్తున్నారు. ఎన్నో క్లిష్టమైన శస్త్ర చికిత్సలను చేసి ఎంతో మందికి ప్రాణాలు పోస్తున్నారు.

☛ ఒంగోలు నగరంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో విశ్వాస్ మల్టీ స్పెషాలిటీ వైద్యశాలలో డాక్టర్ యర్రం నాగార్జునరెడ్డి ఎముకలు, కీళ్ల వైద్యంలో చేయి తిరిగిన వైద్యుడిగా పేరొందారు. కీళ్ల మార్పిడి ఆపరేషన్లు, కీ హోల్ శస్త్ర చికిత్సలు ఎన్నో చేసి మంచి వైద్యుడిగా మన్ననలు పొందుతున్నారు. ఈ వైద్యశాలలో డాక్టర్ కొండారెడ్డి రాధిక గైనకాలజిస్టుగా సాధారణ కాన్పులు చేస్తున్నారు. ఎంతో అవసరమైతేనే తప్ప సిజేరియన్ ఆపరేషన్లు చేయరని పేరుంది. సంతాన లేమి సమస్యలకు ఆధునిక వైద్యం ద్వారా సంతానం కలిగేలా చికిత్స చేస్తున్నారు. ప్రముఖ న్యూరో, బ్రెయిన్ మరియు స్పైన్ సర్జన్ షేక్ వలిబాబు వైద్య సేవలను అందిస్తున్నారు. ఈ వైద్యశాలలో ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్ సౌకర్యం కూడా ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

☛ లంబాడి డొంకలో కేర్ దంత వైద్యశాల గత 14 ఏళ్లుగా జిల్లా ప్రజలకు దంత వైద్య సేవలు అందిస్తోంది. కట్టుడు పళ్లు, ఫిక్స్‌డ్, సెరామిక్ పళ్ల అమరచ్చడంలో డాక్టర్ వేణుగోపాల్ మంచి నైపుణ్యం సాధించారు. ఇంప్లాంట్ డెంచర్స్, ఫిక్స్‌డ్ డెంచర్స్‌లో అపార అనుభవం కలిగిన వేణుగోపాల్ ఎత్తు పళ్లు, వంకరపళ్లకు అత్యాధునిక ఇన్విజలింగ్ వైద్యం చేయడంలో పేరొందారు.

☛ నగరం నడిగొడ్డున రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో ఏబీఎం డిగ్రీ కాలేజీ సమీపంలో ఉన్న జాయ్ ఆస్పత్రిలో ఆండ్రాలజీ, ఫెర్టిలిటీలో అత్యాధునిక వైద్యం అందజేస్తున్నారు. డాక్టర్ నోయల్ జాన్ పేరు తెలియని వారు ఉండరనే చెప్పాలి. యూరాలజీలో ఎన్నో క్లిష్టమైన కేసులను విజయవంతంగా ఆపరేషన్లు చేసిన ఆయన పేదల వైద్యుడిగా పేరొందారు. ఈ ఆస్పత్రిలో అత్యంత ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి. కిడ్నీ సంబంధిత వ్యాధులను నయం చేయడంలో మంచి నైపుణ్యం కలిగిన వైద్యుడిగా నోయల్ జాన్ మన్ననలు అందుకుంటున్నారు.

☛ నగరంలోని కర్నూలు రోడ్డులో జోయాలూకాస్ పక్కన గల రెయిన్ బో దంత వైద్యశాల గత ఏడేళ్లుగా జిల్లా ప్రజలకు వైద్య సేవలు అందిస్తోంది. ఎలాంటి దంత సమస్యనైనా ఇట్టే నయం చేయడం రెయిన్ బో ప్రత్యేకత. ఈహెచ్‌ఎస్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు, ఏపీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులకు, వర్కింగ్ జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత దంత వైద్యం చేస్తున్నారు.

☛ సుందరయ్య భవన్ రోడ్డులోని రాయల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో చిన్న పిల్లలు, మహిళలకు, ఎముకలు, కీళ్లు, జనరల్ వైద్య సేవలు అందిస్తున్నారు. తక్కువ ఖర్చుతోనే ఆపరేషన్లు చేయడం ఇక్కడ ప్రత్యేకత. నేత్ర వైద్యంలో మంచి పేరుంది. ప్రసూతి వైద్యంలో రాయల్ హాస్పిటల్‌కు మెరుగైన రికార్డు ఉంది. ఆరోగ్య శ్రీ, ఈహెచ్‌ఎస్, హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం ఉంది. ఇలాంటి స్పెషలిస్టు వైద్యులు అందుబాటులోకి రావడంతో ఒంగోలు ప్రజలు ఇపుడు వైద్య చికిత్సల కోసం దూర ప్రాంతాలకు వెళ్లడం లేదు. పల్నాడు, నెల్లూరు, బాపట్ల జిల్లా ప్రజలు కూడా వైద్యం కోసం ఒంగోలుకు వస్తున్నారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

ఫార్మసి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు మెడల్స్ అందిస్తున్న విఘ్నేష్ అపావ్

మార్కాపురం: ఫార్మసి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని మార్కాపురం అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అపావ్ పేర్కొన్నారు. శనివారం రాత్రి మార్కాపురంలోని డాక్టర్ జార్జి ఫార్మసీ కళాశాల 23వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల కార్యదర్శి, కర్నూలు జిల్లా కోడుమూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విఘ్నేష్ అపావ్ మాట్లాడుతూ.. ఫార్మసి విద్యార్థులకు దేశ విదేశాల్లో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. 2019లో వచ్చిన కోవిడ్‌తో ప్రపంచమంతా విలవిల్లాడిపోయి లక్షలాది మంది చనిపోయి భవిష్యత్తు ఆందోళనకరంగా ఉన్న నేపథ్యంలో వ్యాక్సిన్ కనిపెట్టి ప్రజలను రక్షించిన ఘనత ఫార్మాసిస్టులకే దక్కిందన్నారు. వివిధ రకాల వ్యాధులను గుర్తించి వాటికి ఎప్పటికప్పుడు ఫార్మాసిస్టు మందులు కనిపెడుతున్నారని, వారి సేవలు అభినందనీయమన్నారు. సమాజంలో ఫార్మాసిస్టులకు మంచి గౌరవం, గుర్తింపు ఉందన్నారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ సతీష్ మాట్లాడుతూ 23 ఏళ్ల క్రితం తన తండ్రి డాక్టర్ శామ్యూల్ జార్జి ఏర్పాటు చేసిన ఈ కళాశాలలో వేలాది మంది విద్యార్థులు బి-ఫార్మసి, ఎం-ఫార్మసి చదివి సైంటిస్టులుగా, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లుగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేయడంతోపాటు ప్రపంచంలోని వివిధ దేశాల్లో కూడా ఉన్నారన్నారు. క్రమశిక్షణ, విలువలు, మంచి ఫ్యాకల్టీతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని అన్నారు. మరో రెండేళ్లలో కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలకు సిద్ధమవుతోందన్నారు. అనంతరం పీజీలో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మెడల్స్, బహుమతులు అందించారు. ముఖ్య అతిథి విఘ్నేష్ అపావ్‌ను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ జయరావు, వైస్ ప్రిన్సిపాల్ సునీత, శ్రీకాంత్, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.